ఉల్లంఘనలపై కొరడా!

- పెండింగ్ చలాన్ల వసూలుపై దృష్టి
- ప్రమాదాల నివారణకు చర్యలు
- ట్రాఫిక్ పోలీసుల నిరంతర కృషి



ఎన్ఏడీ జంక్షన్‌లో ఆటోల పెండింగ్ ఫైన్లు వసూలు చేస్తున్న సీఐ మళ్ల అప్పారావు



హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: రాంగ్ రూట్ ప్రయాణాలు.. సిగ్నల్ జంపింగ్‌లకు చెక్ పెట్టడంపై పోలీసులు దృష్టిసారించారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలకు దిగుతున్నారు. భారీగా చలాన్లు పడిన వాహనదారుల నుంచి జరిమానాలు వసూలు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

కోవిడ్ తర్వాత చాలా మేరకు ట్రాఫిక్ పోలీసులు మానవతా దృక్పథంతో ఫైన్లు వేయకుండా చూసీ చూడనట్లు వ్యవహరించారు. అయితే ఇదే అలుసుగా చేసుకుని వాహనచోదకులు, ఆటో వాలాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని నియంత్రణలోకి తీసుకు వచ్చేందుకు కఠిన చర్యలు చేపట్టారు.

ఒక్కో వాహనంపై 30 వరకూ చలనాలు

ఎన్ఏడీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో తిరిగే పలు ఆటోలకు 20 నుంచి 30 వరకు పెండింగ్ ఫైన్లు ఉన్నాయంటే వారి ఉదాసీనత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దీంతో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు పెండింగ్ ఫైన్లు వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

పాదచారుల రక్షణ కోసం...

పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. ఎన్ఏడీ నుంచి కంచరపాలెం వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు.

స్పెషల్ డ్రైవ్‌లో నమోదు చేసిన కేసులు..	జరిమానాలు
పాత చలానాలు (ఆటోలు, ద్విచక్రవాహనాలతోపాటు) మొత్తం	3,951
పాత చలానాలు వసూలు చేసిన సొమ్ము	రూ.12,82,350
కొత్త చలానాల సంఖ్య	4,919
కొత్త చలానాల ద్వారా వచ్చిన అపరాధ రుసుము	రూ.10,73,300
హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన 3176 మంది వాహన చోదకులకు ఫైన్లు వేశారు.	

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన



హెల్మెట్ వాడకంపై వాహన చోదకుల్లో అవగాహన కల్పిస్తున్నాం. చాలా వరకు ప్రజల్లో అవగాహన కలిగింది. హెల్మెట్ వాడకం బాగా పెరిగింది. గతేడాదిలో జరిగిన ప్రమాదాల్లో ఎంత మంది చనిపోయారో వాహన చోదకుని అర్థమయ్యేలా వివరిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరుతున్నాం. అతి వేగం జిగ్ జాగ్ డ్రైవింగ్, మార్ డ్రైవింగ్ చేయరాదని అవగాహన కల్పిస్తున్నాం.దీంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు నిరంతర చర్యలు చేపడుతున్నాం. దీనిలో భాగంగా పెండింగ్ చలాన్లు వసూలు చేస్తున్నాం. కొత్తగా కేసులు నమోదు చేస్తున్నాం.

– మళ్ల అప్పారావు,
ట్రాఫిక్ సీఐ కంచరపాలెం

అభాగ్యులకు ఆశ్రయం



సాగర్‌దుర్గాబీచ్ పొదల వద్ద ఉన్న వృద్ధురాలికి వస్త్రం కప్పుతున్న చెల్లూరి భాస్కరరావు



అభాగ్యులను వృద్ధాశ్రమానికి తరలిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: సాగర్‌దుర్గా బీచ్ సమీపంలోని పొదల వద్ద ఉన్న మానసిక వృద్ధురాలితో పాటు స్థానిక ఆలయం వద్ద భిక్షాటన చేసుకుంటున్న మరో వృద్ధురాలి దుర్భర స్థితిపై బుధవారం 'సాక్షి' దిన పత్రికలో వచ్చిన కథనంపై సామాజిక వేత్తలు స్పందించారు. మల్కాపురం ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు స్పందించి నేవల్ ఉన్నతాధికారి,మల్కాపురం పోలీసుల సాయంతో నగరంలోని వృద్ధాశ్రమానికి ఇరువురి వృద్ధులను బుధవారం సాయంత్రం అప్పగించారు. దీంతో పలువురు చెల్లూరిని అభినందించారు.

ఫ్యూజ్ బాక్సుల వద్ద రక్షణ చర్యలు

మల్కాపురం: మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ బాక్సులకు అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ప్రమాదకరమైన కటౌట్‌లను ఎవరూ తాకడానికి వీల్లేకుండా బుధవారం ఇనుపజాలీలు ఏర్పాటు చేశారు. 61వ వార్డు మల్కాపురం బస్టాప్ వద్ద, మరిడిమాంబ ఆలయానికి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా ఉండేవి. దీనిపై «సాక్షి»లో ఇటీవల ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్‌ల పేరుతో ప్రచురితమైన వార్తకు ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. మల్కాపురం సబ్ స్టేషన్ ఏఈ పిచ్చయ్య బుధవారం ఉదయం ఆయా ప్రాంతాలకు వెళ్లి రెండు ఫ్యూజ్ బాక్స్‌లకు తలుపులు అమర్చే విధంగా చర్యలు చేపట్టారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎల్‌టీ డిస్ట్రిబ్యూషన్ బాక్స్ ఏర్పాటు చేసిన అధికారులు

క్లుప్తంగా

తానా సభలకు జియ్యానికి ఆహ్వానం



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జూలై నెల 7 నుంచి 9 వరకు నిర్వహించబోయే తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం వచ్చిందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. ప్రతీ ఏడాది ఈ సభలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 15వేల మంది కళాకారులు, ఆధ్యాత్మిక వేత్తలు, పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారు హాజరవుతారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమానికి ఆహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందన్నారు.తన పర్యటన విశాఖ నగర అభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు



విజేతలైన విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న అతిథులు

మల్కాపురం: జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా 61వ వార్డు మల్కాపురం ఉన్నత పాఠశాలలో జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మలేరియా అంటే ఏంటి.. వ్యాధి వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీనిలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో మలేరియా అధికారి మణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన



కార్మిక సమస్యలపై ఆందోళన చేస్తున్న నాయకులు

సింథియా: కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, జాతీయ వేతన విధానం నిర్ణయించాలంటూ కార్మికులు ఆందోళనకు దిగారు. బీఎంఎస్, బీపీఎంఎస్ సంఘాలకు అనుబంధంగా కొనసాగుతున్న ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో నేవల్ డాక్‌యార్డ్ విజయనగర్ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు. దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా నాలుగు తీర్మాలను ఇప్పటికే బీఎంఎస్ ప్రకటించిందన్నారు. దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా నిరసన చేపట్టినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విద్యాసాగర్, దేముడునాయుడు, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లు దాటిన డీఎస్సీ-98 అభ్యర్థుల ధర్నా



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

ఆరిలోవ: డీఎస్సీ–1998లో క్వాలిఫైడ్ అయి 60 సంవత్సరాలు దాటిన వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 1998లో క్వాలిఫై అయిన తర్వాత ఇంత వరకు ఖాళీగా ఉన్నామని, ఇప్పుడు 60 సంవత్సరాలు దాటిపోవడంతో అర్హులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 60 ఏళ్లు దాటిన క్వాలిఫైడ్ అభ్యర్థులు 40 మంది ఉన్నామన్నారు. మానవతా దృక్పథంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల పత్రం అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పార్టీలకు అతీంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 60వ వార్డు బర్మాకాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా ఎక్కడా సంక్షేమ పథకాలు ఆపకుండా అందించిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ సారథికి జనమంతా వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలన్నారు. జనం మెచ్చే నాయకుడు జగన్ అని, ఆయనపై దుష్ట చతుష్టయం,పచ్చబాబులు ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదని ఆనంద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

పేదలకు అందుబాటులో ఉన్నత విద్య .. రాష్ట్ర వ్యాప్తంగా 9,55,662 మంది పేద విద్యార్థులకు ఉన్నత చదువు అందిస్తున్న ఘనత మన జగనన్నది అన్నారు. జగనన్న వసతి దీవెన పథకం ద్వారా రూ. 913 కోట్లు అందించిన నాయకుడు రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి నేడు వసతి దీవెన కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమ చేశారని వివరించారు. వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, ఆకుల కనకరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు స్థానిక దుర్గాదేవి ఆలయంలో ఆడారి ఆనంద్‌కుమార్ పూజలు జరిపారు.

మర్యాదపూర్వక కలయిక



కార్పొరేటర్ నాగేశ్వరరావుకు పూలమొక్క అందిస్తున్న సీవో శివప్రసాద్

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావును 40,41 వార్డుల నూతన సీవో శివప్రసాద్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేసి ప్రతి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తగిన కార్యచరణ రూపొందించి ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీలు సంతోషి, ఈశ్వరి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యకలాపాలపై విచారణ చేపట్టాలి

ఎన్ఏడీ సీఈఐ యూనియన్ నిరసన



ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఏడీ సీఈఐ యూనియన్ నాయకులు, కార్మికులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ పాలక వర్గం ఖర్చుల రూపంలో దోపిడీకి పాల్పడిందని ఎన్ఏడీ సీఈఐ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కోఆపరేటివ్ సొసైటీ రూ.63 లక్షలు అవినీతికి పాల్పడిదని ఆరోపించారు. ఖర్చుల వివరాలు.. ఆడిట్ వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సభ్యులకు 9 శాతం వడ్డీకి రుణాలు ఇవ్వాలన్నారు. టీడీపై రెండుశాతం తగ్గించిన వడ్డీ శాతం తిరిగి చెల్లించాలన్నారు. ఈ అవినీతిపై కలెక్టర్‌తో జిల్లా కోఆపరేటివ్ సొసైటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అవినీతిపై చేస్తున్న పోరాటం ఆగదని మరింత ఉధృతం చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న రామ్మోహనరెడ్డి

సింథియా: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రజల విన్నవించిన సమస్యల పరిష్కారంపై సచివాలయ సిబ్బంది దృష్టిసారించాలని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీలక రామ్మోహనరెడ్డి అన్నారు. వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పూర్తి కావడంతో బుధవారం పార్టీనాయకులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించి ప్రభుత్వంపై ప్రజలకు మంచి అభిప్రాయం కలిగించాలని రామ్మోహనరెడ్డి సూచించారు.

– జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ఘనంగా కేవీ-2 వార్షిక వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం విజయనగర్ కాలనీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కేంద్రీయ విద్యాలయం-2లో బుధవారం పాఠశాల 36వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐఎన్ఎస్ శాతవాహన కమాండింగ్ అధికారి, కేంద్రీయ విద్యాలయాల మేనేజింగ్ చైర్మన్ రాజట్ నాగ్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశే కీలకమన్నారు.విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధన జరగాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బి.రామచంద్రరావు, బాలాజీ, సింహాద్రి, కె.వి.ఎస్. రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారులకు పూర్తి హక్కులు

తప్పులు సరిదిద్దే పోర్టల్ ప్రారంభం



శాంతినగర్ సచివాలయంలో పట్టాలు సరిదిద్దే పోర్టల్‌ను ప్రారంభిస్తున్న జేసి విశ్వానాథన్

గోపాలపట్నం: జీవో నంబర్లు 301, 388 ద్వారా పట్టాలు పొందిన వారు పూర్తి హక్కులు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. ఇందుకు సంబంధించి జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సచివాలయంలో బుధవారం పోర్టల్‌ను ప్రారంభించి.. ఓ లబ్ధిదారుడి పట్టాలో తప్పులను సరిదిద్దారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో నంబర్ 71, 72 ద్వారా గతంలో పొందిన పట్టాల్లో తప్పులు సరిదిద్దుకోవడం, చేర్పు మార్పులు చేసుకోవచ్చన్నారు. ఈ సవరణల ప్రక్రియ పూర్తయిన తర్వాత కన్వెన్షన్ డీడ్ పొందవచ్చన్నారు. దీని ద్వారా పట్టాదారుడికి పూర్తి హక్కులు లభిస్తాయన్నారు. ఆయా సచివాలయాల్లో దరఖాస్తులు లభిస్తాయని సూచించారు. గతంలో పట్టాలు పొందిన వారు విక్రయించేందుకు అవకాశం లేదని.. ఈ జీవోల ద్వారా ఆ అవకాశం కలుగుతుందన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ, డిప్యూటీ తహసీల్దార్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టిన దుండగుడు



ద్విచక్రవాహనం కాల్చేందుకు యత్నిస్తున్న దుండగుడు

గోపాలపట్నం: పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనానికి దుండగుడు నిప్పు పెట్టిన ఘటన ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి జాకీర్ హుస్సేన్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా వెల్డింగ్ పనులు చేసుకునే షేక్ మదీనా వలి అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఇంటి వద్ద ద్విచక్రవాహనం పార్క్ చేసుకున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. మంటల్ని గుర్తించిన స్థానికులు వెంటనే అదుపు చేశారు. కాలనీలో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు గుర్తించారు. కాలిపోయిన వాహనం పక్కనే ఉన్న కొన్ని వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్ పోర్టు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించే పనిలో పడ్డారు.

మెరిసిన శ్రీచైతన్య విద్యార్థులు



సాయిచేతన్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లి

గోపాలపట్నం: ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ జూనియర్ ఇంటర్‌లో అలబోను చరణ్‌తేజ 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించాడు. సొట్ట రాజ్‌కుమార్, జన్యం ప్రశాంతి 463 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు గాను పల్లెడ జ్యోతిర్మయి, కీర్తన 435 చొప్పున మార్కులు సాధించారు. కళాశాలలో ఏవో రవికుమార్ విద్యార్థులను అభినందించారు. ఇంటర్ రెండో ఏడాది ఎంపీసీలో 1000 మార్కులకు గానూ మామిడి సాయి చేతన్,జుత్తాడ గణేష్ శ్రీనివాస్ 983 మార్కులు, నమగిరి తేజాశ్రీ, పువ్వల శ్రీ హర్షిని 982 మార్కులు సాధించారు.

– గోపాలపట్నం హైస్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కలిపి మొత్తం 32 మంది విద్యార్థుల్లో ఇద్దరు మాత్రమే పాసయ్యారు. ఆ ఇద్దరూ బైపీసీ విద్యార్థులే.

మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాలలో ..

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రెండో సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 44 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం విద్యార్థులు73 మంది పరీక్షలు రాయగా 44 మంది పాసయ్యారు. ఇందులో పోతల సింధూర ఎంపీసీలో 967 మార్కులు సాధించగా.. బోని కృష్ణవనిత బైపీసీలో 957 మార్కులు సాధించి కళాశాలలో మొదటి, రెండు స్థానాలు సాధించారు. మొదటి ఏడాదిలో 70 మంది పరీక్షలు రాయగా 31 మంది పాసయ్యారు. ఎంపీసీలో సెగ్గే యువరాణి 406 మార్కులు, బైపీసీలో పరవాడ కృష్ణవేణి 396 మార్కులు సాధించారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై)లో భాగంగా జిల్లాలోని 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడలోని తమ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో స్టేషనరీని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంబంధిత రంగంలో (ప్రైవేటు సెక్టార్లలో) ఉపాధి కల్పిస్తామని తెలియజేశారు. శిక్షణ కోసం ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ కార్యాలయంలో గానీ, 83090 03957, 91332 42666, 94903 91324 నంబర్లలో గానీ సంప్రదించాలని సూచించారు.

భవిష్యత్ సంపదగా మేధో హక్కులు

ఏయూ క్యాంపస్: భవిష్యత్ తరాలకు నిజమైన సంపదగా మేధో హక్కులు నిలుస్తాయని ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా రసాయన శాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ మేధో హక్కుల వేడుకల్లో ఆయన మాట్లాడారు. మనం సాధించిన పేటెంట్లను కమర్షియల్ చేయడం ఎంతో అవసరమన్నారు. తద్వారా సంపదను సృష్టించడం సాధ్యపడుతుందని, ఈ దిశగా ఆవిష్కర్తలు ఆలోచన చేయాలని సూచించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన సహకారం అందిస్తోందన్నారు. పేటెంట్‌తో పాటు బ్రాండింగ్, ట్రేడ్ మార్క్ వంటివి చాలా అవసరమన్నారు. ప్రస్తుతం తమ ప్రతిభతో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. శాస్త్రీయ ఆవిష్కరణలు, పేటెంట్లు సాధించడంలో ప్రతిభ చూపుతున్నారన్నారు. ఎస్ఎస్‌టీఎల్ సైతం తన ప్రస్థానాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభించిందని గుర్తు చేశారు.

ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ ఐపీఆర్‌పై యువతలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఐపీఆర్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటికే ఏయూ తరఫున 70 పేటెంట్లకు దరఖాస్తు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరప్ప, ఆచార్య శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ నుంచి పేటెంట్‌లు సాధించిన డాక్టర్ చందన లక్ష్మి, డాక్టర్ అపరంజిలను సత్కరించారు.

స్టీల్ బీఎంఎస్ ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. బీఎంఎస్ జాతీయ మహాసభలో తీసుకున్న నిర్ణయం మేరకు ఉక్కు అడ్మిన్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కార్మికులందరికీ సామాజిక సురక్ష కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ లేబర్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ చట్టం 1970ని మార్పు చేయాలని కోరారు. ఆర్థిక వికాసం కోసం నేషనల్ లేబర్ పాలసీని ఏర్పాటు చేయాలని, కనీస వేతనాల స్థానంలో జీవించే వేతనం (లివింగ్ వేజెస్) ఇచ్చే విధంగా చట్టంలో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి రాందాస్ నరేంద్ర, స్టీల్ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్. రాధాకృష్ణన్, అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.